
జొహరాపురం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గడ్డా వీధిలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు


ప్రార్థన చేస్తున్న మత పెద్ద హఫీజ్ మంజూర్ అహ్మద్


జొహరాపురం ఈద్గా వద్ద ప్రార్థనలకు హాజరైన మహిళలు


కొత్త ఈద్గాలో ప్రార్థనలకు హాజరైన ఎస్వీ మోహన్ రెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఇంతియాజ్

భక్తిశ్రద్ధలతో రంజాన్

- కిక్కిరిసిన ఈద్గాలు, మసీదులు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- దువా చేయించిన మత పెద్దలు
- ప్రార్థనల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

కర్నూలు కల్చరల్: పవిత్ర రంజాన్ (ఈదుల్ ఫితర్) పండుగ ప్రత్యేక ప్రార్థనలు సోమవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రశాంతమైన వదనాలు.. చిరునవ్వులతో పలకరింపులు.. అందరిలోనూ ఆధ్యాత్మిక భావనలు.. అందరూ ఏకైశ్వరుడైన అల్లాహ్ గురించే తక్బీర్ చెబుతున్నారు. అల్లాహ్‌పైన గల అచంచల విశ్వాసాన్ని నిరూపించుకునేందుకు తహతహలాడారు. మనసునిండా అల్లాహ్ బోధనలే. ప్రతి భక్తుడికి మరో భక్తుడితో ఆధ్యాత్మికమైన బాంధవ్యం పెనవేసుకుంటున్న దృశ్యాలు. ఆత్మీయతకు ప్రతిరూపంగా ఆలింగనాలు. ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, సోదరభావం వెల్లి విరియాలని ముస్లిం మత గురువులు మనసారా ఆకాంక్షించారు. ఉదయం నుంచే ప్రారంభమైన ప్రార్థనలు మధ్యాహ్నం వరకు సాగాయి. కొందరు మసీదులలో ప్రార్థనలు చేయగా ఎక్కువ మంది సమీపంలోని ఈద్గాలలో సామూహికంగా నవాజు, దువా చేశారు.



కొత్త ఈద్గాలో పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు, పాత ఈద్గాలో ప్రార్థన చేయిస్తున్న మతపెద్ద సయ్యద్ సలీం బాషా సాహెబ్

అందరూ సుభిక్షంగా ఉండాలి

కర్నూలు నగరంలోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీం పాషా, సంతోష్ నగర్‌లోని కొత్త ఈద్గాలో మౌలానా ముఫ్తీ మన్సూర్ అహ్మద్ పండుగ సందేశం వినిపించారు. అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు నమాజ్ ఏకైక మార్గమని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రంజాన్ మాసం అనంతరం కూడా నమాజ్ ప్రార్థనలు విడకూడదన్నారు. దేవుని కృప కటాక్షాలకు నమాజ్‌కు మించిన మార్గం లేదని చెప్పారు. రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్ష ఆకలి బాధను తెలియజేస్తుందన్నారు. దీంతోపాటు జీవితంలో ఎదిగేందుకు ఓర్పు, సహనం అలవడుతుందన్నారు. ఆహారం కోసం ఎన్నో కష్టాలు పడుతున్న వారి బాధలు ధనవంతులకు తెలియాలన్నదే రంజాన్ మాసం ముఖ్య ఉద్దేశమన్నారు. ధనికులు, పేద అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సమానంగా ఈదుల్ ఫితర్ నమాజ్ ఆచరిస్తారని చెప్పారు. విలువైన మానవ జన్మ ఇచ్చినందుకు జీవితాంతం ప్రార్థనలతో కృతజ్ఞతలు తెలుపుకుంటామన్నారు. సమత, మమత, మానవతలకు ప్రతి రూపంగా రంజాన్ నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ సుభిక్షంగా ఉండేందుకు దువా, నమాజ్ చేశారు.

ఈద్ ముబారక్ చెబుతూ ఆలింగనాలు..

పవిత్ర రంజాన్ మాస ముగింపు పండుగ ఈదుల్ ఫితర్‌ను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచే శుద్ధి స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని సేమియా పాయసం తిన్నారు. ఈద్ నమాజు చదివేందుకు ఈద్గాల వైపు అడుగులు వేసుకుంటూ అల్లాహు అక్బర్... లా ఇలాహ్ ఇల్లల్లా... హు అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్ లా ఇలాహ్ ఇల్లల్లా హంద్... అంటూ తక్బీర్ చదువుకుంటూ ఈద్గాలకు చేరుకున్నారు. ఈదుల్ ఫితర్ కోసం ఈద్గాలకు వెళ్లలేని మరికొందరు మసీదులకు వెళ్లి ఈద్ నమాజు చదువుకున్నారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించిన ఖాజీలు, మౌల్వీల ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేశారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. నమాజు, దువా అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ కరచాలనం, ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షల అనంతరం పండుగ రావడంతో శుభాలు జరగాలని కోరుకున్నారు. ఆధ్యాత్మికంగా జరిగిన నమాజులో పాల్గొనేందుకు తరలివచ్చిన ముస్లింలతో ఈద్గాలు, మసీదులు కిక్కిరిసిపోయాయి. కొన్ని చోట్ల నమాజుకు స్థలం లేకపోవడంతో రోడ్లపైనే నమాజు చేసుకున్నారు. హిందూ ముస్లిం తేడా లేకుండా ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకోవడం మత సామరస్యానికి ప్రతీకను చాటుకుంది.


రంజాన్ ప్రార్థనలకు పాత ఈద్గాకు తరలివెళ్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా


శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం పెద్దలు

ఈద్ నమాజులో ప్రముఖులు

రంజాన్ పండుగ ఈదుల్ ఫితర్ నమాజులో ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పాత ఈద్గా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ సంతోష్‌నగర్ కొత్త ఈద్గాలో, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ జొహరాపురం, గడ్డా, పాత ఈద్గాల్లో ప్రార్థనలకు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాత ఈద్గాలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్నారు.


సంతోష్ నగర్ కొత్త ఈద్గాలో..


పాత ఈద్గా వద్ద ప్రార్థనకు తరలివచ్చిన ముస్లింలు


సంతోష్ నగర్ కొత్త ఈద్గాలో ప్రార్థన చేయిస్తున్న మత పెద్ద ముఫ్తీ సయ్యద్ మన్సూర్ అహ్మద్


కొత్త ఈద్గాలో దువా చేస్తున్న ముస్లిం

క్లుప్తంగా

మహాగౌరీకి పంచామృతాభిషేకం


మహాగౌరీ దేవికి హారతి ఇస్తున్న అర్చకుడు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో వసంత నవరాత్రుల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, పంచామృతాభిషేకాలు, మండపారాధన, లలితా సహస్ర నామాచార్చన, దేవీ ఖడ్గమాల, సామూహిక కుంకుమార్చనలు, చండీ సప్త శతి పారాయణం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు: రంజాన్ పండుగ పురస్కరించుకుని శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ పర్యవేక్షణలో ప్రధాన ప్రార్థన మందిరాలు ఆనంద్ టాకీస్ వద్ద నున్న పాత ఈద్గా, సంతోష్ నగర్ జాతీయ రహదారి పక్కనున్న కొత్త ఈద్గా వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే నగరంలోని ప్రధాన మసీదుల వద్ద పోలీసు సిబ్బందిని ఉంచారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలోని ప్రధాన రహదారులను మూసివేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. రోడ్డుపైనే ముస్లింలు ప్రార్థనలు చేపట్టినందున వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. మరో మార్గం గుండా వాహనాలు గమ్యాలకు చేరుకునే విధంగా ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

ముగిసిన శ్రీవల్లెలాంబ ఉత్సవం


హోరాహోరీగా తలపడుతున్న పొట్టేళ్లు

కోడుమూరు రూరల్: పట్టణంలో వెలసిన శ్రీ వల్లెలాంబదేవి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు పారువేట, వసంతోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన పొట్టేళ్ల పోటీలు ఎంతో హోరాహోరీగా సాగాయి. పోటీలకు కర్నూలు జిల్లాతో పాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 22 వరకు పొట్టేళ్ల పోటీలో తలపడ్డాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని ఐజకు చెందిన సుల్తాన్ పొట్టేలు విజేతగా నిలిచి మొదటి బహుమతిగా రూ.20 వేలను కైవసం చేసుకుంది. అలాగే గుంతకల్‌కు చెందిన మీసల మామ పొట్టేలు 2వ స్థానం, వెంకటాపురం చెందిన రాయన్ గ్రూపు పొట్టేళ్లు 3, 5 స్థానం, ముడుమలగుర్తి లడ్డు పొట్టేలు 4వ స్థానంలో గెలుపొంది వరుసగా, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలను కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మరకట్టులో ఘర్షణ..

ఆలూరు రూరల్: మండలంలోని మరకట్టు గ్రామంలో సోమవారం ఘర్షణ జరిగింది. ఒక వర్గం మరో వర్గంపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాత కక్షల్లో భాగంగా గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం మరో సామాజిక వర్గానికి చెందిన లక్ష్మి,ఎల్లప్ప, వీర లక్ష్మన్నపై దాడి చేశారు. గాయపడిన వారిని ఆలూరు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. గ్రామానికి చెందిన ఉచ్చీరప్ప, సూర్య ప్రకాష్,పురుషోత్తం,శ్రీనివాసులు, గిరివాసు, వినోద్, నలువప్పపై ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవిశంకర్ రెడ్డి వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో నలుగురు పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పన్నుల ఆదాయం రూ. 79.23 కోట్లు

కర్నూలు (టౌన్): 2024-2025 ఆర్థిక సంవత్సరం గడువు ముగిసింది. సోమవారం సాయంత్రం నాటికి నగరపాలక సంస్థకు ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ఖాళీ స్థల పన్నుల ద్వారా రూ. 79.23 కోట్ల ఆదాయం సమకూరింది. రంజాన్ పండుగ రోజు కూడా పన్ను కౌంటర్లు పనిచేశాయి. సోమవారం పన్నులు చెల్లించేందుకు చివరి రోజు కావడంతో మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ ఇశ్రాయేలు పన్ను కౌంటర్లను పరిశీలించారు. అలాగే సీ.క్యాంపు, బాలాజీ నగర్, కల్లూరు వార్డు కార్యాలయంలో పన్ను వసూళ్లపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. కమిషనర్ ఆదేశాల మేరకు మూడు నెలలుగా పన్ను వసూళ్లపై దృష్టి సారించామన్నారు. గతంలో ఏన్నడూ లేని విధంగా పన్నుదారుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు.


గార్దబంపై సవారీ


ఆలయం చుట్టూ బురదలో గార్దబంచే ప్రదక్షిణలు చేస్తున్న యువకులు

భక్తిభావం.. సాంస్కృతిక వైభవం

- చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఘనంగా ఉగాది ఉత్సవాలు
- ఆలయం చుట్టూ బురదలో ఎడ్లు, గార్దబాలచే ప్రదక్షిణ
- తిలకించి పులకించిన భక్తజనం

కల్లూరు: కల్లూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఉగాది ఉత్సవాలు రెండవ రోజు కనుల పండువగా జరిగాయి. సోమవారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, జ్యోతి సేవ, పంచామృతాభిషేకం, ఉదయం 9 గంటలకు దీపోత్సవ సేవ (జ్యోతుల), బలిహరణ, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న రైతులు తమ ఎడ్లను రంగులు, పూలమాలలతో అలకరించుకుని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రజకులు తమ గాడిదల (గార్దబాల) బండ్లను పూలతో, రంగులతో అలంకరించుకుని డప్పులు, మేళతాళాలు, డ్రమ్స్, డీజేలతో ఉత్సాహంగా కేరింతలు కొడుతూ, నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన బురదలో ఎడ్లు, గాడిదలచే ప్రదక్షిణలు చేశారు. చిన్నారులు, యువకులు ఒంటి నిండా బురద పూసుకొని వేడుకలో పాల్గొన్నారు. ఆలయం చుట్టూ ఉన్న బురదలో తిరగడం వల్ల చర్మవ్యాధుల నుంచి అమ్మవారు కాపాడతారని భక్తుల విశ్వాసం. అలాగే వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని భక్తిశ్రద్ధలతో ఎడ్లు, గాడిదలచే ప్రదక్షిణలు చేయించారు. ఎడ్లు, గాడిదల ఊరేగింపును తిలకించేందుకు కర్నూలుతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


గార్దబాల బండితో ఊరేగింపుగా వస్తున్న భక్తులు


గార్దబాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం వద్దకు తీసుకొస్తున్న భక్తులు

నల్ల రిబ్బన్లతో ముస్లింల నిరసన


నల్ల రిబ్బన్లతో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు


నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(టౌన్): రంజాన్ పండుగ పురస్కరించుకొని నిర్వహించిన ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనల్లో కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మత పెద్దలు, ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి హాజరయ్యారు. నగరంలోని జొహరాపురం ఈద్గా, గడ్డ వీధిలోని ఈద్గా, కొత్త బస్టాండ్‌లోని పాత ఈద్గాలో ముస్లింలతో కలిసి మాజీ ఎమ్మెల్యే నమాజులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ముస్లిం మత పెద్దలు, ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. అయితే అందరం ఐకమత్యంతో శాంతియుతంగా నిరసన తెలిపామన్నారు. వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తిని తగ్గించడంతో పాటు ఈ ఆస్తులను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. అలాగే ప్రతి ఒక్కరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా ప్రభోత్సవం

కర్నూలు కల్చరల్: గూడూరు మండలంలోని జులకల్ గ్రామంలో సోమవారం ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ నీలకంఠేశ్వర రామలింగేశ్వర స్వాములవారికి వైభవంగా ప్రభోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఏడాది నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభల సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ప్రభోత్సవంలో భక్తులు

PUBLIC NOTICE

This is to inform public at large that our Corporation (A.P.S.F.C.) has sanctioned a Medium Term Loan of Rs. 110.00 lakhs to M/s. Lakshmi Constructions. Partner: Smt. Bommana Lakshmi Devi W/o Ramesh Reddy, D.No.45/158, Narasimha Reddy Nagar, Kurnool. She is offering the following schedule property as collateral security by depositing with the Corporation under mentioned title deeds.

SCHEDULE OF PROPERTY

Residential Building D.No. 45/196 together with land admeasuring 266.66 Sq.Yds covered by Survey No.777A, situated at Narasimha Reddy Nagar, Kurnool Municipal Corporation Limits, Kurnool R.O., Kurnool City and District; and bounded by North: D.No. 45/197; South: D.No. 45/195; East: Public Road; West: Hussain House. Originals of Regd.Sale deed Doct. Nos.5880/2015, 53/1993, 7206/1992, 8008/1984, Will No.44/1984 are deposited.

The General Public / Financial Institutions / Banks are hereby informed that anyone having any objection by claiming any title, right, charge, claim whatsoever over the above properties, they may kindly intimate the undersigned in writing within seven days from the date of publication of this notice. Otherwise this property will be taken for mortgage as clear title, and subsequent objection/claim if any will not be entertained and the Corporation is not binding for the same.

Date: 01.04.2025
Place: Kurnool

BRANCH MANAGER
A.P.State Financial Corporation
B-Camp, Birla Guest House
Kurnool.

భక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు


పారాయణం చేస్తున్న సత్సంగం సభ్యులు


హాజరైన భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న శ్రీరామ వసంత నవరాత్రుల సందర్భంగా సోమవారం సామూహిక పూజలు జరిగాయి. లలితా మాత సత్సంగం ఆధ్వర్యంలో లలితా సుందరేశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా సహస్ర పారాయణం, విష్ణు సహస్ర పారాయణం చేశారు. లలితా పీఠం వ్యవస్థాపకులు సందేశమిచ్చారు.

శ్రీరాముడి జీవితం ఆదర్శం


మాట్లాడుతున్న వేణుగోపాల్ శర్మ


పాల్గొన్న సాయి సేవకులు

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్యసాయి బాబా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో నిర్వహిస్తున్న శ్రీరామ కథా వాహిని కార్యక్రమానికి భక్తుల నుంచి అశేష స్పందన లభిస్తోంది. కార్యక్రమంలో భాగంగా రెండో రోజు సోమవారం శ్రీరాముని వైభవంపై ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కల్లె వేణుగోపాల్ శర్మ ఉపన్యసించారు. రామాయణం పఠనం జీవితంలో మార్పు తీసుకొస్తుందన్నారు. దశరథ రాముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ సభ్యులు మాకా అశోక్, సూర్యనారాయణ, సందీప్, పట్టాభి, సంధ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పెద్దలకు పల్లకీ సేవ

ఆస్పరి: వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం పుప్పాలదొడ్డి గిడ్డాంజినేయస్వామి, చెన్నంపల్లి కాత్రికేయస్వామి, వీరభద్రస్వామి పల్లకీలను ఆయా గ్రామాల ప్రజలు కైరుప్పలలో ఊరేగించారు. వీరభద్రస్వామి, కాళికాదేవి పెళ్లికి పుప్పాలదొడ్డి గిడ్డాంజినేయస్వామి, చెన్నంపల్లి కాత్రికేయస్వామి పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. పిడకల సమరం ముగిసేంత వరకు గిడ్డాంజినేయస్వామి, కాత్రికేయ స్వామి పల్లకీలను గ్రామ సింహద్వారం వద్ద ఉంచుతారు. పిడకల పోరాటం తరువాత వీరు రెండు వర్గాల వారిని శాంతింపజేసి వీరభద్రస్వామి, కాళికాదేవి పెళ్లి జరిపించారని స్థానిక కథనం. పిడకల సమరం చూడటానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి రావడంతో కైరుప్పల కిక్కిరిసి పోయింది.


కైరుప్పలలో చెన్నంపల్లి కాత్రికేయస్వామి, కైరుప్పల వీరభద్రస్వామి పల్లకీలను ఊరేగిస్తున్న భక్తులు

12 నుంచి రామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని రామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శతాబ్ది ఉత్సవాల సమితి అధ్యక్షుడు చిలుకూరి ప్రభాకర్, ప్రధాన అర్చకులు మాళిగి హనుమేషాచార్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉత్సవాల ఆహ్వాన పత్రికలను రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్‌చే ఆవిష్కరింప చేసి ఆహ్వానించారు. సమితి కోశాధికారి చిలుకూరి నందకిషోర్, సభ్యులు వ్యాసరాజ్, ప్రాణేష్, నరసింహ, భాను ప్రకాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి పలు అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఏప్రిల్ 1న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. స్థానిక యూకాన్ ప్లాజా ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు. జిల్లా పరిషత్ నుంచి కిడ్స్ వరల్డ్ పార్క్ మధ్యనున్న ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com